ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




- 27న జేఎన్టీయూకే స్నాతకోత్సవం
- వర్సిటీలో చకచకా ఏర్పాట్లు
- బీహెచ్ఈఎల్ సీఎండీకి గౌరవ డాక్టరేట్ ప్రదానం
- మరెందరో ప్రతిభావంతులకు పట్టాలు

ఆ చదువుల తల్లి ఒడిలో ఎంతో మంది సాంకేతిక ఓనమాలు దిద్దారు. ఆ టెక్నాలజీ బడిలో నిపుణులుగా ఎదిగారు. కష్టపడి చదివిన ప్రతిఒక్కరికి అపురూప విజయాలు అందించిన నైపుణ్య గనిగా వర్ధిల్లింది. సామాన్యులను అసామాన్య ఇంజనీర్లగా తీర్చిదిద్దింది. అవకాశాలతో అద్భుత విజయాలు అందించింది. 'విశ్వ 'విజేతలకు నిలయంగా మారింది. కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కీర్తి పతాకమిది.. ఈ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం ఈ నెల 27న జరగనుంది. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

# ప్రతిభకు పట్టం.. అద్భుత ఘట్టం

జేఎన్టీయూకే, జూలై 21

## ఘనంగా స్నాతకోత్సవం

అద్భుత విజయాలతో అప్రతిహతంగా దూసుకుపోతున్న జేఎన్టీయూకే స్నాతకో త్సవాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దేందుకు వర్సిటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భారత హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) మాజీ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ (సీఎండీ) బి.ప్రసాదరావుకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. అలాగే 2014-2018 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పట్టాలు అందించ నున్నారు. పరిశోధన పత్రాలు సమర్పించిన 129 మందికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. యూనివర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించే ందుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే ఈ విద్యా సంవత్సరంలో యూసీఈకే, యూసీఈవీ, వర్సిటీకి అనుబంధంగా ఉన్న 8 జిల్లాల్లోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రతిభ కనబరిచిన 35 మంది టాపర్స్‌కు పతకాలు, ఎండోమెంట్ అవార్డులు, నగదు పురస్కారాలు అందజేయనున్నారు.

## ప్రస్థానం ఇలా మొదలు..

1946వ సంవత్సరంలో ఏర్పడిన జేఎన్టీయూ కళాశాలలో ఇప్పటివరకు ఎందరో ప్రముఖులు విద్యనభ్యసించారు. ఢిల్లీ మెట్రో రైలు రూపకర్త ఎండీ ఈ.శ్రీధరన్ నుంచి ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్, శివసాగర్‌రావు, భాస్కరుడు, జి.ప్రసాదరావు, వరప్రసాదరెడ్డి, ఐఏఎస్‌లు రవిచంద్ర, శ్యామలరావు, శ్రీకాంత్, సీఎస్ ప్రసాదరావు, ప్రస్తుతం మానవ వనరుల శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ వరకు ఎంతో మంది ప్రముఖులు ఈ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యనభ్యసించినవారే. ఇలా ఈ కళాశాలను కాకినాడ కేంద్రంగా ఏర్పాటు చేయాలనేదానికి 2008లో బీజం పడింది. ఇంజనీరింగ్ విద్యకు ప్రాముఖ్యం పెరగడంతో ప్రభుత్వ ఇంజనీరింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో జేఎన్టీయూ కాకినాడను నెలకొల్పారు. తొలి ఉపకులపతిగా అల్లం అప్పారావు నియమితులయ్యారు. నవంబరు 6, 2011లో వర్సిటీ తొలి స్నాతకోత్సవం జరిగింది. పద్మవిభూషణ్ డాక్టర్ సీఆర్ రావుకు గౌరవ డాక్టరేట్ అందజేశారు. ఆ తర్వాత వీసీగా వచ్చిన వీసీ జి.తులసీ రాందాస్ ఆధ్వర్యంలో మూడు స్నాతకోత్సవాలు నిర్వహించారు. రెండో స్నాతకోత్సవాన్ని 2012 ఏప్రిల్ 9న నిర్వహించగా ఢిల్లీ మెట్రో రైలు రూపకర్త ఎండీ ఈ. శ్రీధరన్‌కు గౌరవ డాక్టరేట్ అందజేశారు. మూడో స్నాతకోత్సవాన్ని కూడా జి.తులసీరాందాస్ వీసీగా ఉన్నప్పుడు జూన్ 6, 2013న ఘనంగా నిర్వహించారు. షార్ డైరెక్టర్ డాక్టర్ ఎంవైఎస్ ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. నాలుగో స్నాతకోత్సవాన్ని మే 24, 2014న నిర్వహించగా పద్మవిభూషణ్ డాక్టర్ ఆర్ఏ మషేల్కర్‌కు గౌరవ డాక్టరేట్ అందజేశారు. స్నాతకోత్సవానికి ఎందరో ప్రముఖులను రప్పించారు. అలాగే వీసీ వీఎస్ఎస్ కుమార్ ఆధ్వర్యంలో రెండుసార్లు స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఐదో స్నాతకోత్సవాన్ని నవంబరు 21, 2015న నిర్వహించగా కేంద్ర రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆరో స్నాతకోత్సవాన్ని జనవరి 23, 2018న నిర్వహించారు. పద్మశ్రీ బీవీఆర్ మోహన్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ అందజేశారు. ప్రస్తుత వీసీ రామలింగరాజు తొలిసారి స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



## ఎండోమెంట్ బంగారు పతకాలు

ఇంజనీరింగ్ అన్ని విభాగాల్లోను టాపర్‌గా నిలిచిన విద్యార్థికి ప్రొఫెసర్ అల్లం అప్పారావు బంగారు పతకాన్ని, ఈసీఈలో టాపర్‌గా నిలిచిన విద్యార్థికి ప్రొఫెసర్ వీవీఎల్ రావు మెమోరియల్ ఎండోమెంట్ బహుమతి, యూసీఈకే ఈసీఈలో టాపర్‌గా నిలిచిన విద్యార్థికి డాక్టర్ ఎంఎం సంజీవరావు ఎండోమెంట్ బంగారుపతకాన్ని, సీఎస్ఈలో టాపర్‌గా నిలిచిన విద్యార్థికి కంప్యూటర్ సొసైటీ కార్పొరేషన్ బంగారు పతకాన్ని అందించనున్నారు. యూసీఈకే పెట్రోలియం ఇంజనీరింగ్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థికి కామిరెడ్డి వీరాజు అన్నపూర్ణ మెమోరియల్ బంగారు పతకాన్ని, పెట్రోకెమికల్ ఇంజనీరింగ్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థికి మంత్రి గణపతి సీతా బంగారు పతకాన్ని అందించనున్నారు.

## అదృష్టంగా భావిస్తున్నా..



జేఎన్టీయూ కళాశాలలో చదువుకోవడం, ఇక్కడే ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించడం, వీసీగా నియమితులు కావడం నాకు మాత్రమే దక్కిన అదృష్టం. ఇప్పుడు స్నాతకోత్సవం నిర్వహించే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. నూతన గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఈ కార్యక్రమానికి విచ్చేసే అవకాశం ఉంది. స్నాతకోత్సవానికి పూర్వ ఉపకులపతులతో పాటు పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నాం.

- ఎం.రామలింగరాజు, జేఎన్టీయూకే ఉపకులపతి

## ఘనంగా నిర్వహించనున్నాం



ఏడో స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ప్రముఖులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రముఖుల ప్రసంగం దగ్గర నుంచి విద్యార్థి పట్టా తీసుకునే వరకు ప్రతి అంశాన్ని ప్రణాళికతో రూపొందిస్తున్నాం.

- ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్